



## స్థానిక సమరానికి

# సమాయత్తం

### పల్లెపోరు ఎప్పుడైనా రావచ్చు

**పల్లెల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది.** స్థానిక సమరానికిగానూ రాజకీయ వేడి రాజుకుంటున్నది. ఆశావహులు గ్రామాల్లో సర్పంచ్ సీటును కైవసం చేసుకునేందుకు కదనరంగంలోకి దిగి ఆయా పార్టీల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఐదు జిల్లాలోని 1,692 గ్రామపంచాయతీలు సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికలు ఏ సమయంలో ప్రకటించినా నిర్వహణకు ఆయా జిల్లాల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా రాజకీయ పక్షాలు సైతం స్థానిక పోరుకు సై అంటున్నాయి.

– మహబూబ్‌నగర్, జనవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

| జిల్లా | పంచాయతీలు | వార్డులు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 441 | 3,836 |
| నారాయణపేట | 280 | 2,455 |
| వనపర్తి | 255 | 2,366 |
| నాగర్‌కర్నూల్ | 461 | 4,140 |
| గద్వాల | 255 | 2,390 |

- **ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు**
- **ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 1,692 పంచాయతీలు**
- **సమరానికి సై అంటున్న రాజకీయ పక్షాలు**

గ్రామపంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం త్వరలో పచ్చ జెండా ఊపనున్నది. ఈ మేరకు ఎలక్షన్ కమిషన్ పంచాయతీ పోరుకు సంసిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని జిల్లా కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలు చేరుకున్నాయి. ఎన్నికల సామగ్రిని కూడా అవసరమైన మేరకు పంపించారు. వార్డుల విభజన, గ్రామపంచాయతీల వారీగా నిర్వహించారు. జనాభా ప్రతిపాదికన ఏర్పాటు చేసిన వార్డులకు రిజర్వేషన్ల ప్రక్రియ మాత్రమే మిగిలింది. ఈసారి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయా వర్గాలు డిమాండ్ చేస్తుండడంతో ప్రభుత్వం ఓకే చెబుతుందా? లేదా? అనేది వేచి చూడాల్సిందే.. మొత్తం పైన ఐదు జిల్లాలోని 1,692 గ్రామపంచాయతీలకు ఎన్నికలు ఏ సమయంలో ప్రకటించినా ఆయా జిల్లాల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా రాజకీయ పక్షాలు సైతం స్థానిక సమరానికి సై అంటున్నాయి.

**యంత్రాంగం సన్నద్ధం**

గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రకటించిన తక్షణమే ఏర్పాట్లను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా పంచాయతీ అధికారులు స్థానిక ఎంపీడీవోలతో కలిసి పంచాయతీ ఎన్నికల కోసం సన్నాహాలు చేస్తున్నారు. ఆయా జిల్లాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి బ్యాలెట్ పత్రాలు రాగా.. ఎన్నికల సామగ్రి కూడా అవసరం మేరకు సిద్ధం చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షా సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉండడంతో అధికారగణం వేచి చూస్తున్నది. ఇదిలా ఉండగా ఈనెల 21 నుంచి 24 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు గానూ వివిధ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తోంది. ఈ పథకాలు అమలు చేసిన వెంటనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రత్యక్ష ఎన్నికలా.. పరోక్ష ఎన్నికలా?**


గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరిట ఓట్లు దండుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఆ తర్వాత హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. దీంతో గతేడాది నిర్వహించాల్సిన పంచాయతీ ఎన్నికలు వాయిదా వేస్తూ వచ్చింది. ఈ లోపు ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో అధికార పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగలడంతో పంచాయతీ ఎన్నికలు ఊసే ఎత్తలేదు. చివరకు గ్రామాల్లోని అన్నివర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండడంతో ఈ ఎన్నికలను అడ్డంపెట్టుకొని అమలుకు శ్రీకారం చుడుతున్నది. సర్పంచ్ ఎన్నికలు ప్రత్యక్షంగా జరుగుతాయా..? లేక పరోక్షంగా జరుగుతాయా..? అనేది క్లారిటీ ఇవ్వడం లేదు. అంతేకాకుండా వార్డుల వారీగా రిజర్వేషన్ల ప్రక్రియపై కూడా స్పష్టత లేదు. పరోక్షంగా జరిగితేనే మేలని అధికార పెద్దలు భావిస్తున్నారు.

**రిజర్వేషన్లపై సందిగ్ధం..**

గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. గత ప్రభుత్వం 33 శాతం అమలు చేస్తే దాన్ని పెంచుతామని ఇచ్చిన హామీని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందా? లేదా? అనేది తేలడం లేదు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి ప్రాతినిధ్యం పెరుగుతున్నది. మిగతా వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు పోతారా? రిజర్వేషన్లపై వెనక్కి పోతారనేది ప్రశ్నార్థకంగా మారింది. రిజర్వేషన్లు ఖరారు కావాలంటే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రిజర్వేషన్లపై క్లారిటీ లేదని, కాకపోతే.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉన్నామని ఆయా జిల్లాల కలెక్టర్లు అంటున్నారు.

**సై అంటున్న రాజకీయ పక్షాలు**

స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతున్నట్లు ముఖ్యమంత్రితో సహా మంత్రులు అక్కడక్కడ ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం కూడా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాలు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాయి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని దాదాపు 90 శాతం స్థానిక సంస్థలను బీఆర్ఎస్ కైవసం చేసుకొన్నది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీని కూడా సునాయాసంగా గెలుపొందింది. ఈసారి పథకాలను అడ్డం పెట్టుకొని అత్యధిక పంచాయతీలో పాగా వేయాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తుంది. అయితే బీఆర్ఎస్ గత రికార్డుని తిరగరాయాలని భావిస్తుంది. ఇక బీజేపీ కూడా ఉమ్మడి జిల్లాలో ప్రభావాన్ని చాటుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.





**బీఆర్ఎస్‌దే విజయం..**

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్సే విజయం సాధిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోవడంతో ప్రజలు అదే ఓటుతో బుద్ధి చెప్పబోతున్నారు. రైతు రుణమాఫీ అంటూ ఊరించి గ్రామాల్లో కొంత మందికి మాత్రమే మాఫీ చేసి మిగతా వారికి మొండిచేయి చూపించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా అంటూ అనర్హులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ పథకాలు అమలు చేయలేక చేతులు ఎత్తడం ఖాయం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ పార్టీదే గెలుపు ఖాయం.

**- విజయుడు, అలంపూర్ ఎమ్మెల్యే, జోగులాంబ గద్వాల జిల్లా**



ఎమ్మెల్యే విజయుడికి మొక్కను అందజేస్తున్న చేనేత అధికారులు

## చేనేతకు చేయూతనివ్వాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- అధికారులతో సమీక్ష

అలంపూర్ చౌరస్తా, జనవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి అలంపూర్ నియోజకవర్గంలో ఉన్న చేనేత కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం చేనేత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో చేనేత కార్మికులు ఉపాధి లేక కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వారు కొనుగోలు చేసే ముడి సరుకుల ధరలు అధికం కావడం, తీరా చీరలు నేసిన తర్వాత ధరలు పడిపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని రాజోళి, మానవపాడు, అయిజ, అలంపూర్ మండలాల్లో చేనేత కార్మికుల కుటుంబాలు అధికంగా ఉన్నాయని, వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం పూర్తి స్థాయిలో అమలు చేసి ఆర్థిక చేయూతను అందించాలన్నారు. సమావేశంలో చేనేత ఏడీ గోవిందయ్యా, ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

## 'ధని'యాప్ ముఠా గుట్టురట్టు

- రూ.4కోట్లు స్వాహా ఘటనలో మరో నలుగురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన వనపర్తి ఎస్పీ రావుల గిరి ధర్

వనపర్తి టౌన్, జనవరి 18 : నకిలీ ధని యాప్ ద్వారా రూ.4కోట్లు ఖాజేసిన సైబర్ ముఠాను పట్టుకున్నట్లు ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడించారు. శనివారం ఆయన వనపర్తిలోని ఎస్పీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వనపర్తి పట్టణానికి చెందిన టి.రాజు వృత్తిరీత్యా మెకానిక్. బాలానగర్‌లో నివాసం ఉంటూ ఫేస్‌బుక్‌లో ధని ఫైనాన్స్ లోన్ యాప్ చూసి వివరాల కోసం చూశాడన్నారు. రూ.3లక్షల లోన్ ఇస్తామని, ప్రాసెసింగ్ కోసం రూ.8,860 చెల్లించాలని యాప్ నిర్వాహకులు చెప్పారు. డబ్బులు వేయడంతో లోన్ మంజూరైందని, రాత్రి వరకు డబ్బులు వేస్తామని మరో రూ.6850 వసూలు చేశారు. ఇలా మొత్తం 15,710 వసూలు చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారన్నారు. మోస పోయానని గ్రహించిన రాజు పట్టణ పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో రత్నం, రవిప్రకాశ్, సీఐ కృష్ణయ్య దర్యాప్తు చేపట్టారు. ఏడుగురిని అదుపులోకి తీసుకోగా.. వారిచ్చిన సమాచారం మేరకు మరో నలుగురు సైబర్ నేరగాళ్లను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. గోపాల్‌పేట మండలం నర్సింగాయిపల్లికి చెందిన గగనం ప్రకాశ్ (పెయింటర్), వనపర్తికి చెందిన చీర్ల రవిసాగర్, గుంటి రాజశేఖర్, దేవర్ల సాయికుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కోలకత్తా, బీహార్‌లోని పాట్నాలో ఉన్న అంకిత్, రాహుల్, పంకజ్‌తో కలిసి మోసాలకు పాల్పడేవారని, వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడేవారన్నారు. అంకిత్, రాహుల్, పంకజ్‌ల వారి వాటా కింద 70 శాతం, ప్రకాశ్, రవిసాగర్, రాజశేఖర్, సాయికుమార్ వాటా 30శాతంగా తీసుకొని తెలుగు రాష్ట్రాల్లో సుమారు 15వేల మందికి ఫోన్ చేసి వెయ్యి మందికిపైగా మోసగించి రూ.4కోట్లు ఖాజేశారని వెల్లడించారు.

వచ్చిన డబ్బులతో విలాసవంతమైన ఇండ్లు, వాహనాలను గుర్తించామని, కోర్టు అనుమతితో వాటిని స్వాధీనం చేసుకొని బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ చెప్పారు. ఫేక్ ఫోన్‌కాల్స్, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన యాప్‌ల ద్వారా లోన్లు తీసుకోవడం, బ్యాంక్ సంబంధిత సమాచారం తెలుపవద్దని సూచించారు. మోసపోతే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్సై హరిప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోచింగ్ పేరుతో మోసం

- పేరుకే స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణేమో ఐఏఎస్‌..
- ఎస్పీకి బాధితుల ఫిర్యాదు
- రూరల్ పీఎస్‌లో కేసు నమోదు

మహబూబ్‌నగర్, జనవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అతను ప్రముఖ సైకాలజిస్ట్.. ఉమ్మడి జిల్లాలో పోలీసు రెవెన్యూ యంత్రాంగాల తోపాటు ప్రైవేటు వ్యక్తులకు మానసిక శిక్షణ ఇస్తుంటాడు. ఇదే ముసుగులో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బేస్ స్పోకెన్ ఇంగ్లిష్ పేరుతో ఓ సెంటర్ తెరిచాడు.. సెంటర్ చాటున ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ ఇస్తానంటూ మోసం చేస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. భార్యాభర్తలను కౌన్సెలింగ్ ఇస్తానని చెబుతూ.. పిల్లలను తమకు దూరం చేస్తున్నారని శనివారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ సంఘటన పట్టణంలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఎస్పీ ఆదేశాల మేరకు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీ లో బేస్ స్పోకెన్ ఇంగ్లిష్ పేరుతో కోచింగ్ సెంటర్‌ను ఓపెన్ చేశాడు. కొన్నేళ్లుగా ఇదే పేరుతో అనేక చోట్ల కోచింగ్ ఇస్తూ.. చివరకు సొంత భవనంలోనూ ప్రారంభించారు. ఇక్కడ సుమారు వందమంది విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకునేందుకు చేరారు. ఇక్కడ కొచ్చే తల్లిదండ్రులకు మీ పిల్లలకు ఐఏఎస్, ఐపీఎస్‌గా చేస్తానంటూ.. లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపించారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు


ఈ మేరకు జిల్లా కేంద్రానికి చెందిన మహేశ్వరి, చంద్రకళ, తిరుపతమ్మ జిల్లా ఎస్పీని కలిసి స్పోకెన్ ఇంగ్లిష్ పేరుతో జరుగుతున్న మోసంపై ఫిర్యాదు చేశారు. తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌కల్పిస్తారని నమ్మించి డబ్బులు, ప్లాటును తీసుకొని చివరకు తమ పిల్లల్ని ఏం చేయకుండా మానసికంగా హింసించారని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైవిజయ్ కుమార్ తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో పెద్ద ఎత్తున బాధితులు బయటికొచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు భరోసా సెంటర్‌లోనూ బాధితులు ఫిర్యాదు చేశారు.

### ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

అయిజ, జనవరి 18 : ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ఇన్‌ఫ్లో 3,291 క్యూసెక్కులు ఆనకట్టకు చేరుతున్నది. శనివారం ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 595 క్యూసెక్కులు విడుదల చేయగా, ఆనకట్టపై ఓవర్ ఫ్లో 2,696 క్యూసెక్కుల వరద దిగువనున్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.5అడుగుల మేర నీటి నిల్వ ఉన్నట్లు ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రధానకాల్వకు వస్తున్న నీటిని డీ–25 వరకు చేరుతున్నట్లు వెల్లడించారు. సుంకేసుల బ్యారేజీలో ప్రస్తుతం ఎఫ్ఆర్ఎల్ 291 అడుగులు ఉందని, 291.5 అడుగులకు చేరగానే తుమ్మిళ్ల ఎత్తి పోతల పథకం ప్రాంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీటిని వృథా చేయకుండా పంటలకు వినియోగించాలని రైతులకు సూచించారు. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచి పోగా, అవుట్‌ఫ్లో 12,011 క్యూసెక్కులుగా నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 66.139 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1,633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి ప్రస్తుతం 1,621.67 అడుగులున్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

- రైతులు ఏమైపోయినా పట్టించుకోరా?

## ప్రచారానికే ప్రారంభోత్సవాలా?



ఏదుట్లలో విద్యుత్ ఉప కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

- తొమ్మిది రోజుల కిందట ఏదుల సబ్‌స్టేషన్ ప్రారంభం
- విద్యుత్ సరఫరా కాక పోవడంపై రైతుల ఆగ్రహం
- సర్కారు తీరును నిరసిస్తూ సబ్‌స్టేషన్ వద్ద నిరసన

గోపాల్‌పేట, జనవరి 18 : మండలంలోని ఏదుట్లలో రూ.కోటీ 96లక్షలతో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఈ నెల 9వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. కాగా, నాటి నుంచి నేటి వరకు విద్యుత్ సరఫరా చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం గ్రామస్తులు, రైతులు విద్యుత్ ఉపకేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లో వోల్టేజీ సమస్యను అధిగమించేందుకు కేసీఆర్ సర్కారులో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరువ తీసుకొని గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు చేయించి పనులు కూడా పూర్తి చేయించారన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభానికి నోచుకోక పోవడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ నెల 9వ తేదీన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులమీదుగా ప్రారంభించి నేటి వరకు గ్రామానికి విద్యుత్ సరఫరా చేయకపోవడమేమిటని ప్రశ్నించారు. లో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రానున్నది వేసవి కావడంతో మరింత ఇబ్బందులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ హర్షవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా, విద్యుత్ ఉప కేంద్రం నిర్మించిన కాంట్రాక్టర్ తమకు అప్పగించలేదని, ఇందుకు సంబంధించి పేపర్ వర్క్ చేయాల్సి ఉందన్నారు. ఆపరేటర్లు కూడా అలాట్ కాలేదని, ఇవి పూర్తయితే సోమ, మంగళవారం విద్యుత్ ఉప కేంద్రం ద్వారా గ్రామానికి విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, రేవల్లి మండలాధ్యక్షుడు రఘురామారావు, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు తిరుపతి యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు ఎండీ మతీన్, గోపాల్, వడ్డె గోపాల్, రైతులు కిషన్‌రావు, ధర్మయ్య, వెంకటేశ్వర్‌రావు, చల్మారెడ్డి, బాలకిష్టయ్య, శ్రీను, బంగారయ్య, ఆంజనేయులు, కృష్ణయ్య, శ్రీశైలం, గౌరయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.


## గట్టు తాసీల్దార్ సస్పెన్షన్

గట్టు, జనవరి 18 : గట్టు తాసీల్దార్ సరితారాణిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సంతోష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులను నిర్లక్ష్యం చేయడం తోపాటు అవినీతి, ఆరోపణల కారణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కాగా, కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తున్న వీరభద్రప్పను ఇన్‌చార్జి తాసీల్దార్‌గా నియమించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, తాసీల్దార్ గట్టులో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. ఇటీవల కలెక్టర్ తాసీల్దార్ కార్యాలయానికి వచ్చినప్పుడు కనీస మర్యాద పాటించకపోవడం తెలిసిందే. దీనికితోడు ఆమెపై అవినీతి, ఆరోపణలు వచ్చాయి. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడం వంటివి కూడా సస్పెన్షన్‌కు కారణమని తెలుస్తోంది.

### చారిత్రక ఆలయాలను కాపాడుకుందాం

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

పెబ్బేరు, జనవరి 18 : వందల ఏండ్ల చరిత్ర కలిగిన రంగాపూర్ గ్రామంలోని ఒటిగుడి ఆలయం, అలాగే సూగూర్ వైష్ణవాలయాలకు సరైన వసతులు లేక పోవడంతో శిథిలావస్థకు చేరాయని, వాటిని పరిరక్షించుకోవాలని పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి అన్నారు. శనివారం 400 చరిత్ర కలిగిన ఒటిగుడి ఆలయం, వైష్ణవాలయాలను సందర్శించారు. ఆలయాల పరిరక్షణకు చర్యలు తీసుకోక పోవడంతో అక్కడక్కడా గోడలు కూలి శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేపట్టాలన్నారు.



మాట్లాడుతున్న శివనాగిరెడ్డి

## మూడు కార్లు ఢీ : ఒకరి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

- మరో ఐదుగురికి తీవ్రగాయాలు

అచ్చంపేట రూరల్, జనవరి 18 : అచ్చంపేట మండలం హాజీపూర్ సమీపంలో శనివారం మూడు కార్లు ఢీకొట్టుకోవడంతో ఒకరు మృతిచెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన 12మంది కుటుంబ సభ్యులు రెండు కార్లలో హైదరాబాద్ నుంచి రంగాపూర్ నిరంజన్ షా వలీ దర్గాకు వస్తుండగా హజిలాపూర్ సమీపంలో ఢీకొట్టుకున్నాయి.

ఈ ప్రమాదంలో కర్ణాటకలోని గుల్బర్గకు చెందిన బిలాల్(27) అక్కడికక్కడే మృతిచెందగా, విష్ణుకాంత్, విజయలక్ష్మి, వాసవి, మంజు, జగదీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు 108లో తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అచ్చంపేట ఎస్సై రమేశ్ తెలిపారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

పెబ్బేర్, జనవరి 18 : పట్టణంలో రూ.3.40కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవన్‌కుమార్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. జాతీయ రహదారి నుంచి సుంకులమ్మ ఆలయం వరకు రూ.కోటీ 20లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణం, రూ.కోటి నిధులతో పట్టణంలో చేపడుతున్న సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులు, అలాగే మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు రూ.55లక్షలు, జనరల్ ఫండ్స్ రూ.5లక్షలు మొత్తం రూ.60లక్షలతో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు, రూ.80లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు వారు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ నవన్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ పరిధిలో అంబేద్కర్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ నవన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి